క్లుప్తంగా

హిందూ ధర్మాన్ని కాపాడుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న గౌరయ్య

మల్కాపురం: హిందువులంతా ఐక్యంగా ఉండి సనాతన ధర్మ పరిరక్షణకు పాటు పడాలని హిందూ ధర్మ రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గౌరయ్య పిలుపునిచ్చారు.జీవీఎంసీ 59వ వార్డు శాంతిగిరికాలనీలో కొత్తలంక భువనేశ్వరి ఆధ్వర్యంలో శనివారం హిందూ ధర్మ రక్షణ సమితి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గౌరయ్య మాట్లాడుతూ పిల్లల్లో కూడా ఆధ్యాత్మిక చింతన అలవడేలా చర్యలు తీసుకోవాలన్నారు.బలవంతపు మత మార్పిడులను అడ్డుకోవాలన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొలిమేర శ్రీనివాస్, శ్రీరామ్, కిరణ్, పొలిమేర హరిత,గుత్తుల సతీష్, మళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాలయంలో ప్రత్యేక పూజలు



లలిత పారాయణ చేస్తున్న మహిళలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్లవీధిలోని కృష్ణాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవిజ్ఞాన మండలి యాదవ్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో యాదవ సామాజిక వర్గ మహిళ లు పాల్గొని కృష్ణుని ఉత్సవ విగ్రహానికి పాలు,పెరుగుతో అభిషేకాలు చేశారు. అనంతరం లలిత పారాయణ,గోవింద నామాలను పఠించారు.


ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్



క్రీస్తు సందేశాన్ని వివరిస్తూ ర్యాలీగా వెళ్తున్న క్రైస్తవులు

సింధియా: క్రీస్తు శిలువ మార్గాన్ని అనుసరిస్తూ పారిశ్రామిక ప్రాంతం 63వ వార్డు పురవీధుల్లో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏసుక్రీస్తు శిలువను మోస్తూ ప్రజల పాప విముక్తికి చేసిన త్యాగాన్ని, క్రీస్తు శిలువ మార్గం, పలికిన ఏడు మాటలు ద్వారా క్షమా గుణం, బాధ్యత, ప్రేమ, దయా గుణం అలవచ్చుకోవాలని, ప్రపంచ శాంతి కోసం క్రీస్తు ఇచ్చిన సందేశాన్ని గుర్తు చేసుకున్నారు. ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంతంలోని ఏడు వార్డుల క్రైస్తవ సంఘ సభ్యులు పాల్గొన్నారు.


లభించని గల్లంతైన విద్యార్థి ఆచూకీ



సముద్రంలో గాలిస్తున్న నేవీ సబ్బంది, న్యూపోర్టు పోలీసులు,

పెదగంట్యాడ: పాత గంగవరం తీరంలో గురువారం గల్లంతైన విద్యార్థి ఒనుం తనూష్(15) ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ సీఐ కామేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ న్యూపోర్టు పోలీసులు, కోస్టుగార్డు సిబ్బందితో పాటు నేవీ సిబ్బంది సోనాబోట్ సహాయంతో సముద్రంలో గాలించినా ఫలితం లేకపోయిందన్నారు. ఆదివారం మరోసారి గాలింపు చర్యలు చేపడతామని సీఐ తెలిపారు.

ముగిసిన ఫైర్ సర్వీస్ వీక్



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో ప్రాక్టీస్ ఫైర్ ప్రివెన్షన్–సేవ్ ఇండియా అనే థీమ్‌తో ఈ నెల 14న ప్రారంభమైన ఫైర్ సర్వీస్ వీక్ శనివారంతో ముగిసింది. అగ్ని భద్రత గురించి అవగాహన పెంచడం, సురక్షితమైన పని ప్రదేశాన్ని ప్రోత్సహించడంపై పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు రోజున అగ్నిమాపక భద్రత గురించి అవగాహన పెంచడానికి మాక్ తరలింపు, ప్రత్యక్ష అగ్నిమాపక కసరత్తు నిర్వహించారు. సురక్షితమైన పని పద్ధతుల ద్వారా అగ్ని ప్రమాదాలను నివారించడాన్ని సంస్థ చైర్మన్ అండ్ డైరెక్టర్ హేమంత్ ఖత్రి వివరించారు. కార్యక్రమంలో ఇతర డైరెక్టర్లు, హెచ్ఎస్ఎల్ ఉద్యోగులు, యూనియన్ ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.





నరసింహనగర్ ప్రాంతంలో రెండు వీధుల్లో..

యూజీడీ కనెక్షన్లు ఎక్కడ?

పలు ప్రాంతాల్లో కానరాని వైనం

పట్టించుకోని అధికారులు



గోపాలపట్నం ఇందిరానగర్‌లో ప్రధాన రహదారిలో యూజీడీ కనెక్షన్లు లేక ఇలా..

గోపాలపట్నం: మరుగు, మురుగునీటికి చెక్ పెట్టి పరిశుభ్రతకు పెద్దపీట వేయాలన్న లక్ష్యానికి అధికారుల నిర్లక్ష్యం.. ప్రజల్లో అవగాహన లోపం గండికొడుతున్నాయి. జీవీఎంసీ పరిధిలో నూతనంగా విస్తరిస్తున్న ప్రాంతాల్లో సైతం యూజీడీ కనెక్షన్లు కానరావడం లేదు. ఈ పరిస్థితి జోన్–8లోని పలు ప్రాంతాల్లో కనిపిస్తోంది. మొదట్లో అధికారులు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేవారు. యూజీడీ కనెక్షన్ల వల్ల ఉపయోగాలను వివరించడంతో ప్రజలు ముందుకు వచ్చేవారు. ఆ తర్వాత వలంటీర్ల ద్వారా దరఖాస్తులు స్వీకరించేవారు. అంతలోనే ఆ బాధ్యతను మంచినీటి సరఫరా విభాగానికి అనుసంధానం చేశారు. అప్పటి నుంచి ఇది పూర్తిగా మరుగున పడిపోయింది.

అవగాహన లేమి : యూజీడీ మ్యాన్ హోల్‌కు వ్యక్తిగత కనెక్షన్ పెట్టుకునే విధానం ఇంటి యజమానులకు తెలియని పరిస్థితి ఉంది. దీనివల్ల ఏమంత ప్రయోజనం.. నష్టం లేదని ఇప్పుడే అక్కర్లేదన్నట్లు చాలామంది చెబుతున్నారు.దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

సచివాలయంలో దరఖాస్తు చేయాలి

యూజీడీ కనెక్షన్ కోసం ఆయా ప్రాంతంలో సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఆ దరఖాస్తులు మంచినీటి సరఫరా విభాగం అధికారుల వద్దకు వెళ్తే వారు దరఖాస్తు దారుని ఇంటిని పరిశీలించి జీవీఎంసీకి కట్టాల్సిన ధరావత్తును సూచిస్తారు. అది కట్టిన తర్వాత మరుగుదొడ్డి నుంచి వచ్చే పైప్‌ను యూజీడీకి కలుపుతారు.

యూజీడీ వల్ల ప్రయోజనాలు

యూజీడీకి ఇంటి మరుగు అనుసంధానం చేసుకుంటే ప్రయోజనాలు ఎక్కువగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. భూగర్భ జలాలు కలుషితం కాకుండా చేయగలుగుతామని చెబుతున్నారు. యూజీడీ నుంచి వచ్చే నీటిని శుద్ధి చేసి తిరిగి వాడుకునే విధంగా వ్యవస్థలను రూపొందించారు. ఈ శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలకు, మొక్కలు పెంచేందుకు వినియోగిస్తున్నారు.

తగ్గుతున్న దుష్ప్రభావాలు : కాల్వల గుండా వెళ్లిన మురుగు నీరు చివరగా పంట పొలాలు, సముద్రాలు, నదుల్లో కలుస్తుంది. దీని వల్ల మంచి నీరు కలుషితమై విషపూరితమవుతుంది. అదే యూజీడీల ఉంటే చాలా మేరకు మంచినీరు కలుషితమ్యే అవకాశాలు తగ్గుతాయని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

యూజీడీ కనెక్షన్ కోసం అందరూ దరఖాస్తు చేసుకోవాలి. అలా చేసుకుంటే మంచిది. డ్రైనేజీ వ్యవస్థలో మార్పులు జరుగుతున్న నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ యూజీడీ కనెక్షన్ పెట్టుకోవాలి. దీని వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయి.

– సింహాచలం నాయుడు, ఏఈ, యూజీడీ విభాగం

పారిశుధ్య పనులు ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వొద్దు



జోన్–5 జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

జోన్–5లో పారిశుధ్య కార్మికుల ధర్నా

కంచరపాలెం: మున్సిపల్ కార్మికుల్ని, పారిశుధ్య బాధ్యతలను ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వొద్దని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ జోన్–5 జ్ఞానాపురం జోనల్ కార్యాలయం వద్ద శనివారం మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు టి.నూకరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వాలని నిర్ణయించడం పట్ల కార్మికులందరూ తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రైవేటు ఏజెన్సీల దగ్గర కూటమి ప్రభుత్వ నేతలు వేల కోట్లు కమీషన్లుగా తీసుకున్నారని, అందుకే మున్సిపల్ కార్మికుల బతుకులను కాంట్రాక్టర్లకు అప్పజెప్పేందుకు చూస్తున్నారని ఆరోపించారు. 20 సంవత్సరాలుగా ఏ ప్రభుత్వం అయితే మున్సిపల్ కార్మికులను ప్రైవేటుపరం చేసే ప్రయత్నం చేసిందో ఆ ప్రభుత్వాల సంగతి తేలే దాకా కార్మికులు నిద్రపోలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వానికి కూడా అదే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. కార్మికులు, రాష్ట్ర ప్రజల కన్నా ప్రైవేటు పెట్టుబడిదారులే చంద్రబాబు ప్రభుత్వానికి ఎక్కువైపోయారని అన్నారు.



జోనల్ కమిషనర్ రాముకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ఆప్కాసులో ఉన్న పొరపాట్లని సరిచేసి ఎంత మెరుగైన వ్యవస్థను తీసుకొచ్చినా ఫర్వాలేదని, లేదంటే ఆప్కాస్ రద్దు చేస్తే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ ప్రైవేటీకరణ విధానాలను బద్దలుకొట్టే వరకూ ఈ పోరాటాన్ని కొనసాగించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. అనంతరం జోనల్ కమిషనర్ బి.రాముని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జోన్ కార్యదర్శి ఒమ్మి అప్పారావు, నాయకులు ఎస్. శ్రావణ్‌కుమార్, వి.మహేశ్వరి, సీతాలక్ష్మి, అప్పలరాజు, పి.రాజు, ఎం.సత్యవతి, బాలరాజు, శివమణి, ధనలక్ష్మి, నూకరాజు, కొండమ్మ, కనకరాజు, సత్యవతి, కన్నతల్లి, కేధారి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఈస్టర్ వేడుకలు



ప్రత్యేక ప్రార్థనలు జరగనున్న రక్షణ గిరి ముఖద్వారం

కంచరపాలెం: క్రైస్తవులు ఉత్సాహంగా జరుపుకునే పాస్కా(ఈస్టర్) వేడుకలు ఆదివారం జరగనున్నాయి. మృత్యుంజయుడైన క్రీస్తును స్తుతించే ప్రార్థనలనే పాస్కాగా పిలుస్తారు. గుడ్‌ఫ్రైడే మరుసటి రోజు రాత్రి 12 గంటల తర్వాత ఏసుక్రీస్తు సమాధి నుంచి బయటికి వస్తారని క్రైస్తవులు విశ్వసిస్తారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జ్ఞానాపురం రక్షణ గిరిలో శనివారం రాత్రి నుంచి జాగరణ, దివ్య పూజా బలులు, ప్రార్థనలు నిర్వహించారు. లోకరక్షకుడు క్రీస్తును జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన దేవాలయానికి తీసుకొచ్చారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడ దివ్యపూజా బలులు సమర్పిస్తామని సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన దేవాలయ చర్చి విచారణకర్తలు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ తెలిపారు. పారిస్ పాస్టిల్ కౌన్సిల్ సభ్యులు ఉత్సవానికి నేతృత్వం వహిస్తారని ఆయన తెలిపారు.

స్వచ్ఛత కోసం కలిసి అడుగేద్దాం..

- అధికారుల పిలుపు
- వాడవాడలా 'స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర'



58వ వార్డులో జరిగిన ప్రతిజ్ఞ చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి, విద్యార్థులు



60వ వార్డులో స్థానికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్‌యాదవ్



కంప్యూటర్ వ్యర్థాలు సేకరిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు, విద్యార్థులు



గోపాలపట్నం ప్రధాన రహదారిలో ర్యాలీ చేస్తున్న అధికారులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

మల్కాపురం: స్వచ్ఛత కోసం ఐక్యతతో అడుగేద్దామని అధికారులు పిలుపునిచ్చారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుతామని విద్యార్థులతో, స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో శనివారం నిర్వహించారు.

- జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం వద్ద స్వచ్ఛతపై వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.
- 60వ వార్డు గుల్లలపాలెం వద్ద శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్‌యాదవ్ ఆధ్వర్యంలో శానిటరీ సిబ్బంది, కాలనీ వాసులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. స్వచ్ఛత వైపు అంతా అడుగులు వేయాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సచివాలయ శానిటరీ సెక్రటరీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

92వ వార్డులో..

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డులోని పలు ప్రాంతాల్లో జీవీఎంసీ అధికారులు స్వచ్ఛాంధ్ర...స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలపట్నం నుంచి వెంకటాపురం జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అందరూ సమష్టిగా కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో శానటరి ఇన్‌స్పెక్టర్ గోపి, శానిటరీ కార్యదర్శులు, మూర్తి పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీపేట పాఠశాలలో ఈ–వ్యర్థాల తొలగింపు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు రామ్మూర్తిపంతులుపేట పాఠశాలలో శనివారం ఈ–వ్యర్థాల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. హెచ్‌ఎం ఆర్. శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కంప్యూటర్ ల్యాబ్‌కు సంబంధించి ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, వృథాగా పడిఉన్న వస్తువులను సేకరించి ఒకచోట ఉంచి జీవీఎంసీకి అందించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ–వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో రీసైక్లింగ్ చేయాల్సిన ఆవశ్యకత ఉందని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కంప్యూటర్ కో–ఆర్డినేటర్ సీహెచ్ పల్లవి, పీఈటీ బాలరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాల తొలగింపు అవసరం

మల్కాపురం: ఇంట్లో పాడైన కంప్యూటర్లు, ఫోన్లు, బ్యాటరీ పరికరాలు, ప్రింటర్లు, వాషింగ్ మెషీన్లు మొదలైనవి పర్యావరణానికి ఎంతో హానికరమని ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. వాటిని వెంటనే తొలగించాలని సూచించారు. స్వచ్ఛతపై మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మల్కాపురం శాఖా గ్రంథాలయం వద్ద, పరిసరాలను శుభ్రం చేశారు. వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి, అంజలీదేవి, నదియా తదితరులు పాల్గొన్నారు.

ఈ వేస్ట్‌ను రీసైకిల్ చేయకపోతే అనారోగ్య సమస్యలు

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- ఇక ప్రతి బుధవారం ఈ వేస్ట్ సేకరణ
- గాజువాకలో ఈ వేస్ట్ లోగో ఆవిష్కరణ



ఈవేస్ట్ లోగోను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

గాజువాక: స్వచ్ఛాంధ్రప్రదేశ్, స్వర్ణాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా విశాఖ నగరంలో ప్రతి బుధవారం ఈ వేస్ట్ సేకరణను ప్రారంభించనున్నామని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంపై గాజువాకలో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఈ వేస్ట్ సేకరణ లోగో, ఈ వేస్ట్ సేకరణ డబ్బాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లెడ్, మెర్క్యురీ, కాడ్మియం వంటి విష పదార్థాలు నేలలోకి, నీటిలోకి చేరి పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాయన్నారు. వాటి వల్ల పలురకాల ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. దీనిపై అప్రమత్తం కాకపోతే హానికరమైన వాయువులు విడుదలవుతాయని, శ్వాసకోశ సమస్యలు, చర్మ సమస్యలు, క్యాన్సర్ వంటి రోగాలను కలిగిస్తాయని అన్నారు. పాత ఎలక్ట్రానిక్స్‌లో బంగారం, వెండి, కాపర్ వంటి విలువైన లోహాలు ఉంటాయని, వాటిని రీసైకిల్ చేయకపోతే వృథా అవుతాయన్నారు. ఈ వేస్ట్‌ను రీసైకిల్ చేయడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని అన్నారు. రీసైక్లింగ్ పరిశ్రమలో సేకరణ, వేరు చేయడం, మరమ్మతు వంటి పనుల్లో కొత్త ఉపాధి అవకాశాలు ఏర్పడతాయన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరేష్ కుమార్, గాజువాక జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్.శేషాద్రి, ఎస్ఈ గోవిందరావు, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఏ, వీవోఏ ప్రతినిధులు, మొబైల్, ఎలక్ట్రానిక్స్ దుకాణదారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



మాట్లాడుతున్న సీపీ బాగ్చీ. చిత్రంలో డాక్టర్ సీతా మాణిక్యం

మహారాణిపేట: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసు కమిషనర్ శంకబ్రత బాగ్చి అన్నారు. శనివారం ఆంధ్రా విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ లా కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, మహిళలపై జరిగే సైబర్ నేరాలపై ప్రసంగించారు. సైబర్ నేరాలు జరుగుతున్న విధానం, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు తెలిపారు. డాక్టర్ అంబేద్కర్ లా కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. సీతామాణిక్యం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జి.రాఘవయ్య, ప్రొఫెసర్ వి.రాజ్యలక్ష్మి, ప్రొఫెసర్ ఎ.పద్మావతి, ప్రొఫెసర్ ఎస్.బి. చంద్రకళ, డాక్టర్ కె.పల్లవి, న్యాయ, సిట్ విభాగాల నుంచి అనేక మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌కు పూర్తి బాధ్యతల అప్పగింత



ప్రిన్సిపాల్ మంజులను అభినందిస్తున్న కళాశాల అధ్యాపక బృందం

డాబాగార్డెన్స్: విశాఖ జిల్లా భీమునిపట్నం ఎస్‌వీఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ ఆర్. మంజులకు విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు అదనపు బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆమెకు విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, ఇతర అధ్యాపక బృందం, అధ్యాపకేతర సిబ్బంది ఆమెను అభినందించారు.

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

గాజువాక: వచ్చేనెల 10, 11 తేదీల్లో విశాఖలో నిర్వహించనున్న సీపీఐ జిల్లా 25వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సమితి కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఎ.జె.స్టాలిన్ కోరారు. సీపీఐ చినగంట్యాడ శాఖా మహాసభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలో కొనసాగించాలని, అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్‌లు మంజూరు చేయాలని, కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై మహాసభల్లో తీర్మానాలు చేస్తామన్నారు. అనంతరం చినగంట్యాడ శాఖా కార్యదర్శిగా జి.ఆనంద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, దొడ్డి మల్లేశ్వరరావు, అప్పారి విష్ణుమూర్తి, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి తులసిపూజ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తులసిపూజలో సిరులతల్లి